నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నబంబర్ 8 :ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చంద్రయ్య హాట్స్, 11కేవీ భానునగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10. 30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ రైయిన్ బజర్, 11కేవీ వెంకటేశ్వర ఆలయం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2. 30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో..

ఆర్కేపురం: బ్యాంక్ కాలనీ, జీఎస్ఐ, లింగోజిగూడ, ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సరూర్‌నగర్ డీఈ రామకృష్ణ తెలిపారు. బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు దానాపురం, జనప్రియ కాలనీ, కాకతీయ కాలనీ, క్రిష్ణానగర్, మానస కన్‌సెక్షన్, మైత్రీనగర్, సౌభాగ్యనగర్, ఎస్‌బీహెచ్ కాలనీ1-2-3, సత్యవతినగర్, టీఎన్ఆర్ అపార్ట్‌మెంట్స్, వాస్తు కాలనీ పరిసర ప్రాంతాలు, జీఎస్ఐ ఫీడర్ పరిధిలో జీఎస్ఐ పరిసర ప్రాంతాలు, లింగోజిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు గౌతమినగర్, సౌభాగ్యనగర్, హెచ్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్, కాకతీయ కాలనీ, లింగోజిగూడ, మానస కన్‌సెక్షన్, మణిపూరి, మాస్ కాలనీ, రాజిరెడ్డినగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, శివపురి కాలనీ, సాయిరామనగర్, శ్రీనివాస కాలనీ పరిసర ప్రాంతాలు, ఇందూఅరణ్య అపార్ట్‌మెంట్స్ ఫీడర్ పరిధిలో ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్, తిరుమల ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

బడంగ్‌పేట, నవంబర్8: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డులో ప్రైమరీ స్కూల్‌లో రూ.17లక్షలతో సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్ రవినాయక్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. వార్డులో వాటర్ పైపులైన్లు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి సమస్యలను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడు ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన వార్డులో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని వివరించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

హయత్‌నగర్, నవంబర్ 8 : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ పద్మావతి కాలనీలో ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్స్ పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇదే దారిలో ప్రతిరోజు 20 నుంచి 30 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వారం రోజులుగా కాలనీలో ప్రధాన రోడ్డుపై పెద్దగా గుంత ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట వృద్ధులు, చిన్నారులు బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. తెలంగాణ పద్మావతి కాలనీ మీదుగా ఆర్టీసీ డిపో-1, డిపో-2లకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, హయత్‌నగర్ కోర్టుకు కూడా ఇదే దారిలో తొర్రూర్, మునగనూరు, ఇంజాపూర్, తుర్కయాంజాల్ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో పలుచోట్ల ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌కు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ పద్మావతి కాలనీలో ధ్వంసమైన మ్యాన్‌హోల్

నరేందర్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పెండెం నరేందర్‌గౌడ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ ఆర్‌కే పవన్ కుమార్ పర్యవేక్షణలో 'నీడ్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ ఫర్ ఎల్ఐఎస్ ప్రొఫెషనల్స్ ఆఫ్ అకాడమిక్ లైబ్రరీస్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి నరేందర్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ఆయనను ఈ సందర్భంగా అధ్యాపకులు యాదగిరి , చక్రవర్తి, రవికుమార్, దుర్గాప్రసాద్, రాజాగౌడ్ అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఎల్బీనగర్, నవంబర్ 8: సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 40 వేల చెక్కును తన నివాసంలో బాధితురాలు లతకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ గుప్తా మాట్లాడుతూ పేదలను అత్యాధునిక, కార్పొరేట్ వైద్య సేవలు పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ దోహదం చేస్తుందన్నారు. ఎంతో మంది పేదలకు సీఎం రిలీప్ ఫండ్‌తో వైద్యం అందుతుందన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా

విద్యార్థులు శాస్త్రీయ ధృక్పదం అలవర్చుకోవాలి

మండల స్థాయి టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కందుకూరు, నవంబర్ 8 : విద్యార్థులు చిన్నప్పటి నుంచి శాస్త్రీయ ధృక్పదం ఏర్పాటు చేసుకోవాలని మండల పరిధిలోని పులిమామిడి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. మండల టీఎస్ యూటీఫ్, జనవిజ్ఞాన వేదికలు సంయుక్తంగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పులిమామిడి పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా చందన, దీక్షిత, సంజన, మేఘన. విజయ్, రిషికేషన్ మండలస్థాయిలో ఎంపిక య్యారని తెలిపారు. మండల స్థాయిలో ఈ నెల 21న పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి డాక్టర్ బుగ్గరాములు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసన్న దేవి, స్టాన్లీ ,చెన్నయ్య, ఉపాధ్యాయులు జయంతి, శ్రీవిద్య, శిరీష, స్వామి, వాణిశ్రీ, బుచ్చయ్య, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

పార్కులను శుభ్రంగా ఉంచుకోవాలి

బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్3లో పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబర్ 8 : కాలనీల్లోని పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్3 లోని హెచ్ఎండీఏ పార్కును ఆయన పరిశీలించారు. పార్కును అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేశామన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచేవి పార్కులని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాకర్స్ కూడా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సాయి నికేతన్, ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, శ్యామ్‌కుమార్, బీఎం రావు తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదికను వినియోగించుకోవాలి

కాచిగూడ, నవంబర్ 8: ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విశ్వకర్మ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ యువతీయువకుల కోసం 10న భద్రాద్రి కొత్తగూడంలోని రథంకొండ అర్బన్‌పార్క్ మణుగూరులో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతీయువకులు ఈ పరిచయ వేదికల్లో పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడు మృతి

మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి, ఎమెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 8 : రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడు మృతి చెందాడు. కందుకూరు గ్రామానికి చెందిన ఎడ్ల ఉమాకాంత్ (30) ఈ నెల 3న చేపలు పట్టే వలను కొనడానికి సికింద్రాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం ఢీ కొట్టింది. అతడిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చేతికి వచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదన మిన్నంటాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గ్రామానికి చేరుకొని పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుంటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. ఆమె వెంట మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల పాండు , నాయకులు కార్తీక్ బొక్క దీక్షిత్‌రెడ్డి, బర్కం వెంకటేశ్, ర్యాపాక ప్రభాకర్ రెడ్డి, సురేందర్ ఉన్నారు.

నకిలీ ఆయిల్ విక్రేతల అరెస్ట్

కాచిగూడ, నవంబర్ 8: అమాయక ప్రజలను మభ్యపెట్టి, బ్రాండెడ్ కంపెనీ పేరుతో డబ్బులు దండుకున్న వ్యక్తులను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కుకురాజ్ జకర్, అదే రాష్ట్రానికి చెందిన జవరా రామ్ వీరిద్దరూ కలిసి కొన్ని నెలలుగా ముంబైకి చెందిన ఓక్‌హార్ట్ రిజనేరేటివ్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో నకిలీ ఆయిల్ తల వెంట్రుకలు పెరగడానికి తయారు చేసిన ఆయిల్‌ను కాచిగూడలోని భూమన్నలైన్, పలు ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓక్‌హార్ట్ రిజనేరేటివ్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ హర్ప్రాలిసింగ్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, శుక్రవారం వారిని అదుపులో తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళ అదృశ్యం

లక్ష్మి(ఫైల్)

అంబర్‌పేట, నవంబర్ 8: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జె.శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం..ఫీవర్ దవాఖాన పక్కన ఓ ఇంట్లో సూరన్న, అక్కిరెడ్డి లక్ష్మి నివాసముంటున్నారు. 2011లో లక్ష్మి భర్త చనిపోయాడు. 2017లో కర్నూరులోని ప్రభుత్వ దవాఖానలో సూరన్నకు లక్ష్మి పరిచయమైంది. అప్పటి నుంచి వీరద్దరూ హైదరాబాద్‌కు వచ్చి ఓల్డ్ నల్లకుంటలో సహజీవనం చేస్తున్నారు. ఈనెల 1వ తేదీన లక్ష్మి పింఛను తెచ్చుకుంటానని చెప్పి ఏపీ సత్యసాయి జిల్లా ఎద్దులవండ్ల పల్లికి వెళ్లి తిరిగి ఈనెల 7వ తేదీన రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు రాగా.. సూరన్న లక్ష్మిని తీసుకొని తాము నివాసముంటున్న ఓల్డ్‌న లక్కుంటకు వచ్చారు. లక్ష్మిని ఇంట్లో వదిలి టిఫిన్ తీసుకొస్తానని సూరన్న బయటకు వెళ్లి తిరిగి రాగా రూముకు తాళం వేసి ఉన్నది. దీంతో ఆమె కోసం అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. రూములో ఆమెకు సంబంధించిన లగేజీ కూడా కనిపించలేదు. దీంతో వెంటనే అతడు నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంబర్‌పేట కబేళాకు టెండర్లు వేయాలి

అంబర్‌పేట, నవంబర్ 8: అంబర్‌పేట కబేళాను నిర్వహించే కాంట్రాక్ట్ పిరియడ్ ఏప్రిల్-2024లో ముగిసినప్పటికీ టెండర్లు వేయకుండా లీజును పొడిగించడం అక్రమమని, ఏప్రిల్ నుంచి ఆరు నెలల పాటు పొడిగించిన జీహెచ్ఎంసీ అధికారులు మరోసారి పొడిగించడానికి ప్రయత్నిస్తున్నారని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. టెండర్లు వేయకుండా పొడిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. 2021 ఏప్రిల్‌లో అన్మోల్ ట్రేడింగ్ కంపెనీ అల్ ఆహద్ కంపెనీలతో కూడిన కన్సార్టియంతో మూడేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్న జీహెచ్ఎంసీ, 2024 ఏప్రిల్ కంటే ముందే టెండర్ ప్రక్రియ మొదలుపెట్టకుండా సమయం లేదంటూ లీజు పొడిగిస్తూ వెళ్తున్నారన్నారు. లీజు పొడిగింపులో పెద్దఎత్తున అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా చెంగిచెర్ల కబేళాలో ఇదే రకమైన అక్రమాలు జరిగాయని, ఈ ప్రభుత్వం కూడా అంబర్‌పేటలో అదే పద్ధతి కొనసాగిస్తున్నదని విమర్శించారు. లీజు పొడిగింపు తక్షణమే ఆపాలని, టెండర్ ప్రక్రియని వెంటనే మొదలు పెట్టాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జేఎల్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 1392 జూనియర్ లెక్చరర్ అభ్యర్థులకు తక్షణమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జేఎల్ అభ్యర్థులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏండ్ల తరువాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల భర్తీకి 2022లో నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. 2023లో రాత పరీక్ష నిర్వహించగా, 2024 జూలైలో మెరిట్ జాబితాతో పాటు తుది ఫలితాలు విడుదల చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నియామక పత్రాలు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహించి, 55 రోజుల్లో నియామక పత్రాలు అందజేసిన ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జేఎల్‌లుగా చేరి రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో అభ్యర్థులు డాక్టర్ లింగా నాయక్, వేణు, రమేశ్‌రెడ్డి, సుమన్, రాజశేఖర్, అభిషేక్, నాగరాజు, శ్రీనివాస్, అజయ్, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పల్ మహంకాళి ఆలయం సందర్శన

ఉప్పల్ ప్రధాన రహదారిపై ఉన్న మహంకాళి ఆలయాన్ని శుక్రవారం ఎండోమెంట్ అధికారులు సందర్శించారు. ఆలయా న్ని ఎండోమెంట్ విభాగంలో విలీనం చేసే అంశాలపై అర్చకులు, ఆలయ కమిటీ వారితో చర్చించారు. ఆలయానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. కాగా ఆలయ నిర్వాహకులపై ఆరోపణలు రావడంతోనే అధికారులు వచ్చినట్లు పలువురు భావిస్తున్నారు. -ఉప్పల్,నవంబర్ 8:

నార్సింగిలో వరుస దొంగతనాలు

మణికొండ, నవంబర్ 8 : వరుసగా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా దేవాలయాలల్లోని హుండీలను టార్గెట్ చేస్తూ దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. పోలీసులు ఠాణాల్లో భూ వివాదాల పరిష్కారానికే అధిక సమయం కేటాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దొంగలు వారి పని వారు కానిచ్చేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. ఇటీవల ఖానాపూర్ గ్రామం లో శుక్రవారం మధ్యాహ్న సమయంలోనే హనుమాన్ ఆలయంలో హుండీని దొంగిలించిన పరిస్థితి. హైదర్షా కోట్, పుప్పాలగూడ ప్రాంతాల్లో ఇళ్ల ల్లో చోరీలు చోటుచేసుకున్నాయి. వీటిపై దృష్టి సారించాల్సిన పోలీసులు పాతకేసులను మూసే పనిలోనే నిమగ్నమయ్యారని, దొంగతనాలు జరుగుతున్నాయంటూ బాధితులు ఠాణాకు వస్తే స్పందించడం లేదంటూ వారు వాపోతున్నారు. నార్సి ంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పోలీసుల పర్యటన కనిపించకపోవడంతో దొంగ లు రెచ్చి పోతున్నట్లు సమాచారం.ఇప్పటికైనా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

సత్తాచాటిన జిమ్నాస్ట్‌లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 6వ ఇంటర్ డిస్ట్రిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్లేయర్లు సత్తాచాటారు. సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన టోర్నీలో వివిధ జిల్లాల నుంచి దాదాపు 300 మంది బాలబాలికలు పోటీ పడ్డారు. అండర్-12, సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. టోర్నీలో పతకాలు సాధించిన జిమ్నాస్ట్‌లు సూరత్(గుజరాత్) వేదికగా డిసెంబర్‌లో నిర్వహించే జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరపున పోటీకి దిగనున్నారు. పతక విజేతలను గాడియం స్కూల్ డైరెక్టర్ కీర్తిరెడ్డి అభినందించారు.

ఎంసీఏ' రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ (రెండేళ్ల కోర్సు) పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 14వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 14వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓయూ వెబ్‌సైట్ www.os mania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

ఎల్బీనగర్, నవంబర్ 8: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన గౌడౌన్‌పై సరూర్‌నగర్ పోలీసులు దాడులు చేసి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి కథనం ప్రకారం.. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరూర్‌నగర్ ఇందిరాహిల్స్ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం సదరు గోడౌన్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో 65 బ్యాగుల్లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని నిల్వ ఉంచిన బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ ఆర్మోరీ, బహదూర్‌పూర్ ఖరూర ప్రాంతానికి చెందిన కుందన్‌కుమార్ ప్రస్తుతం సరూర్‌నగర్ ఇందిరాహిల్స్‌లో ప్లాట్ నెంబర్ 70లో నివాసం ఉంటూ అక్కడ రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి నిల్వ ఉంచారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు దీని వెనుక ఎవరెవరు ఉన్నారన్న విషయాన్ని ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ జితేందర్‌నాయక్‌కు విద్యార్థి నాయకులు వినతిపత్రం అందజేశారు.

అక్రమ అరెస్టులు హేయమైన చర్య

కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

ఆర్కేపురం, నవంబర్ 8 : అక్రమ అరెస్టులతో సమస్యలపై ప్రశ్నించకుండా ఆపుదామనుకోవడం కాంగ్రెస్ పార్టీ మూర్ఖత్వమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంగెంలో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఉండటంతో ఉమ్మడి నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని తన నివాసంలో చైతన్యపురి పోలీసులు ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభాకర్‌రెడ్డి నివాసానికి తరలివెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేసి ఏదేదో చేద్దామనుకుంటున్నారని, రాజకీయ పార్టీని అక్రమ అరెస్టులతో ఆపుదామనుకుంటే అంతకుమించిన తెలివి తక్కువ తనం మరొక్కటి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన బీఆర్ఎస్‌ను అడ్డుకోలేరని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి కాంగ్రెస్ పార్టీ మాట నిలబెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల శేఖర్, రమేశ్ కురుమ ఉన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

మలక్‌పేట, నవంబర్ 8: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఏడేండ్లుగా యువతిని వాడుకొని మోసం చేసిన యువకుడిపై చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువతి, యువకుడు అనిల్ కుటుంబాలు కొన్నేళ్లక్రితం జీవనోపాధికి నగరానికి వచ్చి పాత మలక్‌పేట డివిజన్‌లోని ఎంసీహెచ్ కాలనీలో నివాసముంటున్నాయి. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న అనిల్, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఓ యువతితో పరిచయం పెంచుకొని లోబర్చుకున్నాడు. పెళ్లి విషయం తీసినప్పుడల్లా రేపు, మాపు అంటూ వాయిదాలు వేసుకొచ్చిన అనిల్ ఆ తర్వాత ముఖం చాటేయటంతో శుక్రవారం యువతి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ తరలించిన విదేశీయురాలు.. 13 ఏండ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు,నవంబర్7: ఉగాండా నుంచి డ్రగ్స్ తరలిస్తూ రాజీవ్‌గాంధీ విమానాశ్రయంలో పట